సాక్షి
నారాయణపేట
మంగళవారం । 13 । జూన్ । 2023



ఘనంగా షాలీ ఉర్సు

అలంపూర్‌లోని షా–అలీ–పహిల్వాన్ ఉర్సు వైభవంగా కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸



‘సీఎన్‌ఆర్’కు బీ ప్లస్ గ్రేడ్

నారాయణపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ ‘బి ప్లస్’ గ్రేడ్ లభించింది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.7 /24.2

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తొలిరోజు 20శాతం హాజరు



నారాయణపేట రూరల్: **వేసవి విరామం** తర్వాత మొదటిసారిగా **విద్యార్థులు పాఠశాల** మెట్లు ఎక్కారు. పలు **ప్రభుత్వ పాఠశాలల్లో** మొదటిరోజు గదులకు **మామిడి తోరణాలు** కట్టి, పూజలు చేసి తర**గతులు ప్రారంభిం**చారు. ప్రైవేటు పాఠశా**లల్లో రంగులు వేసి** యజ్ఞాలు చేశారు. ఇక సో**మవారం జిల్లాలోని** పాఠశాలల దగ్గర పెద్దగా **నందడి కనిపించ**లేదు. జిల్లా వ్యాప్తంగా **339 ప్రాథమిక, 85** ప్రాథమికోన్నత, 76 ఉన్నత, 11కేజీబీవీ, 2మైనార్టీ, ఒక బీసీ, రెండు మోడల్, 6సోషల్ వెల్ఫేర్, ఒక ట్రైబల్ వెల్ఫేర్, మూడు ఎయిడెడ్, 138 ప్రైవేటు పాఠశాలలు కలిపి 1.02లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. అయితే తొలిరోజు కేవలం 20శాతం మాత్రమే చిన్నారులు పాఠశాలకు వచ్చారు. అయితే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేపట్టలేదు. చాలాచోట్ల టీచర్ల కొరతతో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కనీసం శుభ్రం చేసేందుకు స్కావెంజర్లు సైతం అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్మికులతో మమ అనిపించారు. టీచర్ల కొరతకు తోడు సరిపడా గదులు లేక భవిష్యత్ రోజుల్లో ఇబ్బందులు తప్పేలా లేదు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నారాయణపేట రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు ఫస్ట్ ఇయర్‌లో మార్కుల పెరుగుదల కోసం దరఖాస్తు చేసుకున్న వారు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్‌లో 772కు 740, ఒకేషనల్‌లో 32కు 32మంది పరీక్ష రాశారు. అదేవిధంగా సెకండ్ ఇయర్‌లో జనరల్ 159కి 150, ఒకేషనల్‌లో 9కి 8మంది పరీక్షకు హాజరయ్యారు. జిల్లా తనిఖీ బృందం కోస్గి మక్తల్, నారాయణపేట, ఫ్లయింగ్ స్క్వాడ్ మరికల్, ధన్వాడ, సిట్టింగ్ స్క్వాడ్ కోస్గి, ధన్వాడలో పర్యటించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

నారాయణపేట రూరల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో సోమవారం బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలలు తప్పకుండా బడిలోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో పనులకు పంపరాదన్నారు. పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో లేబర్ అధికారి రాజ్‌కుమార్, పీపీ సురేష్, అడ్వకేట్లు నందునామాజీ, వినోద్, సర్పంచ్ జమునా బాయి, సెక్రెటరీ శ్రీనివాసులు ఉన్నారు.



సభావేదికపై మంత్రులు మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, అబ్రహం, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు సాయిచంద్, ఆంజనేయులు గౌడ్, గట్టు తిమ్మప్ప, నాయకుడు మందా జగన్నాథం, బండారి భాస్కర్

నడిగడ్డకు వరాల జల్లు

గద్వాల ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్ ప్రకటన

- గద్వాల మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, ఇతర మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల ప్రత్యేక నిధులు
- రాష్ట్ర ఏర్పాటుతో పాలమూరు రూపురేఖలు మారాయ్
- మళ్లోసారి గద్వాలకు వచ్చి తృప్తిగా మాట్లాడతా..
- గత స్మృతులను గుర్తుచేసుకున్న సీఎం

గద్వాల రూరల్/ గద్వాల: జోగుళాంబ గద్వాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నడిగడ్డకు వరాల జల్లు కురిపించారు. సోమవారం జిల్లాకేంద్రంలో సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతోపాటు బీఆర్‌ఎస్ ఆఫీసును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు. ప్రధానంగా ఆర్డీఎస్, గట్టు, మల్లమ్మకుంట ఎత్తిపోతలను పూర్తిచేసి ప్రజల బాధలు తీరుస్తామని చెప్పారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షలు, 12 మండలాలకు రూ.15 లక్షలు, గద్వాల మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, మిగతా మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా సరిహద్దులోని అయిజలో మరో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామన్నారు.

ఇక్కడే మొదటి పాదయాత్ర చేశా..

‘ఒకనాడు కష్టాల్లో మునిగిపోతే గంజికేంద్రాలు పెట్టేవారు.. ఆర్డీఎస్ కాల్వను మనకు కాకుండా చేసి.. సాగునీటిని గద్దలాగా తన్నుకుపోతే.. తెలంగాణ ఉద్యమంలో మొట్టమొదట జోగుళాంబకు దండం పెట్టి.. జోగుళాంబ టు గద్వాల పాదయాత్ర చేపట్టా.. ఆనాడు అనేక చోట్ల అలంపూర్, గద్వాల, నడిగడ్డలో హృదయ విదారక దృశ్యాలు చూసి కళ్ల వెంబడి నీళ్లు పెట్టుకుని చాలా బాధపడ్డాం.. కడుపులో పెట్టుకున్నాం.. అప్పుడు కొత్తగా పార్టీ పెట్టినప్పటికీ తేరుమైదానంలో సభ పెడితే ప్రళయం మాదిరి జనాలు తరలివచ్చారు. అలా ప్రారంభమైన ఉద్యమం పుణ్యమా అని రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిపాలనలో సంస్కరణలు తీసుకువచ్చాం. అందులో భాగంగానే గద్వాల జిల్లా సాధించుకున్నాం. జిల్లా ఏర్పడటమే కాదు.. ఈ రోజు రాజభవనం తలపించే సెక్రటరియేట్ అంత గొప్పగా ఉండే కలెక్టర్, ఎస్పీ భవనాలు ప్రారంభించుకున్నాం.. దానికి మీ అందరిని కూడా హృదయ పూర్వకంగా అభినందిస్తున్నా.. అని సీఎం కేసీఆర్ అన్నారు. సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పుట్టుక నుంచి చావు వరకు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సాయం అందుతోందని చెప్పారు. ఉమ్మడి పాలమూరులో ఐదు మెడికల్ కళాశాలలను ఏర్పాటుచేయడంతోపాటు కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా 15 నుంచి 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ఒకప్పుడు ఇక్కడి నుంచి పొట్టచేతపట్టుకుని ముంబయి, కర్ణాటక వంటి ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఉండేదని.. అప్పట్లో ఎడారిని తలపించిన పాలమూరు ఇప్పుడు ధాన్యపు రాశులు, కొనుగోలు కేంద్రాలు, హార్వెస్టర్లతో కళకళలాడుతోందని కేసీఆర్ అన్నారు. ఈ రోజు కర్నూలు, రాయచూర్ నుంచి మిర్చి, పత్తి ఏరేందుకు మన దగ్గరికి వలస వస్తుంటే గర్వంగా ఉంది.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

ఇద్దరూ ఉద్యమకారులే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఉద్యమకారులే అని సీఎం అన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలు ఫీల్డ్‌లో ఉండి నాతో పాటు తెలంగాణ కోసం పోరాడితే.. శ్రీనివాస్‌గౌడ్ ఉద్యోగం చేసుకుంటూ ఉద్యోగం పణంగా పెట్టి ఉద్యోగుల పక్షాన పోరాటం చేశారని కొనియాడారు. మల్లమ్మకుంటను త్వరలోనే పూర్తి చేస్తానని, మరోసారి గద్వాలకు వచ్చి తృప్తిగా మాట్లాడతానని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, రవీందర్‌రావు, ఎంపీ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, చిట్టెం రాంమోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు ఆంజనేయగౌడ్, సాయిచంద్, నాయకులు మంద జగన్నాథం, గట్టు తిమ్మప్ప, మున్సిపల్ చైర్మన్ కేశవ్ పాల్గొన్నారు.



కలెక్టర్ వల్లూరు క్రాంతిని కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు చెబుతున్న సీఎం కేసీఆర్



ఎస్పీ సృజనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేసీఆర్



ప్రగతి నివేదన సభకు హాజరైన జనం

సీఎం కేసీఆర్ పర్యటన సాగిందిలా...

సాయంత్రం 4.10 గంటలకు ముఖ్యమంత్రి **కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్**‌లో గద్వాలకు **చేరుకున్నారు.**

4.18 గంటలకు హెలీప్యాడ్ వద్ద సీఎం **కేసీఆర్, హోంమంత్రి** మహమూద్ అలీకి **కలెక్టర్ వల్లూరు** క్రాంతి స్వాగతం పలికారు.

4.23 గంటలకు రోడ్డు మార్గంలో నూతన బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు.

4.32 గంటలకు బీఆర్‌ఎస్ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభం

4.37 గంటలకు మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు చిత్రపటానికి నివాళులర్పించారు.

4.40 గంటలకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సీఎం పరిచయం చేసుకున్నారు.

4.53 గంటలకు హోం మంత్రి చేతుల మీదుగా నూతన ఎస్పీ కార్యాలయం ప్రారంభం.

5.00 గంటలకు ఎస్పీ సృజనను తన చైర్‌లో కూర్చొబెట్టి.. సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

5.09 గంటలకు సమీకృత కలెక్టరేట్ వద్ద సీఎం గౌరవ వందనం

5.14 గంటలకు ప్రత్యేక పూజల మధ్య సమీకృత కలెక్టరేట్ ప్రారంభం

5.29 గంటలకు సర్వమత ప్రార్థనల మధ్య కలెక్టర్ వల్లూరు క్రాంతి తన చైర్‌లో ఆసీనులయ్యారు. అనంతరం సీఎం కేసీఆర్‌తో ముఖ్య నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

5.41 గంటలకు ఉద్యోగల సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

6.00 గంటలకు జిల్లా ఉద్యోగులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

6.10 గంటలకు రోడ్డు మార్గంలో సభ స్థలికి సీఎం కేసీఆర్ చేరుకున్నారు.

6.13 నుంచి 6.26 గంటల వరకు సీఎం కేసీఆర్ ప్రసంగం

6.40 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరిన సీఎం కేసీఆర్

‘గట్టు’తో గద్వాల బంగారు తునక

ఉద్యోగుల సమావేశంలో సీఎం కేసీఆర్

గద్వాల/ గద్వాల రూరల్: జోగుళాంబ జిల్లాలోని గట్టు ఎత్తిపోతల పథకం పూర్తయితే గద్వాల ప్రాంతం వజ్రపు, బంగారు తునక అవుతుందని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం కేసీఆర్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో తెలంగాణ అనేక రంగాల్లో నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. పర్ క్యాపిట్ ఇన్‌కంలో, పర్ క్యాపిట్ పవర్ యుటిలైజేషన్‌లో, ఓడీఎఫ్ ప్లస్‌లో ఇలా అనేక రంగాల్లో దూసుకెళ్తున్నామన్నారు. ఉద్యమ సమయంలో ఇదే నడిగడ్డలోని ఇటిక్యాల మండలానికి వచ్చినప్పుడు.. ఓ గ్రామానికి వెళ్లాను. అక్కడ ప్రజల కష్టాన్ని, గోసను చూసి తాను కూడా ప్రజలతో కలిసి ఏడ్చేశానని గుర్తుచేశారు. ఏడ్వాల్సిన సందర్భం ఎందుకు వచ్చిందంటే.. కృష్ణ, తుంగభద్ర నదుల మధ్య ఉన్న నడిగడ్డకు నీళ్లు రాలేదని, అందుకోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్‌ను మళ్లీ సాధించుకున్నామని, మల్లమ్మకుంట రిజర్వాయర్ పూర్తయితే అలంపూర్ సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. గద్వాలకు త్వరలో మెడికల్ కళాశాల రాబోతుందని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు మెడికల్ కళాశాలలు వస్తాయని ఊహించామా.. అదే తెలంగాణ సాధించుకున్న అద్భుతమైన ప్రగతి అన్నారు. సంపద పెరుగుతుంది కాబట్టి.. ఇది సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా సాధించాల్సిన అభివృద్ధి ఉందని వివరించారు. మానవీయ కోణంలో ఆలోచించి అనేక మంచి నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. స్టంటింగ్ ప్రాబ్లం అని ఒకటి ఉంది.. పిల్లల పెరుగుదల ఆగిపోడానికి మాల్ న్యూట్రిషన్ కారణం. ఒకసారి ఒక జనరేషన్ స్టంటింగ్ బారిన పడితే.. అది రిపేర్ కావడానికి వందేళ్లు పడుతుందని చెప్పారు. మన దగ్గర అలాంటి దిక్కుమాలిన బాధ రావొద్దనే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రపంచంలో ఎవరూ ఆలోచించని విధంగా కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజల ఆయురారోగ్యాలు బాగుండాలని అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బాగుపడ్డామని చెప్పి రిలాక్స్ అయిపోతే మనం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వరి ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి మనం నంబర్‌వన్ స్థానంలో ఉన్నామన్నారు.

రూ.లక్ష సాయం ఎందరికో?



మద్దూరులోని మీసేవ కేంద్రంలో దరఖాస్తుదారుల సందడి

- తహసీల్దార్ ఆఫీసుకు కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు
- మీసేవ కేంద్రాల వద్ద నిరీక్షణ
- కులం, ఆదాయం ధ్రువపత్రాల కోసం బారులు

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందాలనే ఆలోచనతో ఉన్న వారి అవసరాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు దళారులు, సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ వసూళ్లకు దిగుతున్నట్లు సమాచారం. చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీలలోని 15కులాలకు తొలివిడతలో అవకాశం కల్పించింది. ఈమేరకు ఆయా కులాలకు చెందిన వారు కులధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ ఆఫీసుల ఎదుటబారులు తీరుతున్నారు.

మీసేవ కేంద్రాలు కిటకిట..

ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రూ.లక్ష సాయం పథకం కింద ముందుగా దరఖాస్తు చేసుకుంటే, మనకే వస్తుందంటూ కొందరు ప్రచారం చేయడంతో ఆశావహులంతా ఒక్కసారిగా దరఖాస్తు చేసుకునేందుకు ముందుకొచ్చారు. దీంతో రెండు రోజులుగా జిల్లాలోని మీ సేవ కేంద్రాలన్నీ కిటకిటలాడుతున్నాయి.

దరఖాస్తుల వెల్లువ..

మీసేవ కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయానికి కుప్పలుతెప్పలుగా చేరుతున్నాయి. ఒక్క మద్దూరు మండలంలోనే రెండు రోజుల నుంచి ఇప్పటివరకు రెండువేల వరకు దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది. తహసీల్దార్ ఆఫీసుకు చేరిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముడిసరుకులు కొనుగోలు చేయవచ్చు..

ఈ పథకం కింద ఇచ్చే రూ.లక్షతో లబ్ధిదారులు వారి చేతి, కులవృత్తులకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చు. అలాగే అవసరమైన ఉపకరణాలను కూడా కొనుగోలు చేసుకునేందుకు వీలుంటుంది. ఈ ఆర్థిక సహాయాన్ని ముడిసరుకులు కూడా కొనుగోలు చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొనుగోలు బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. మండల ప్రత్యేకాధికారి ఈ యూనిట్ల గ్రౌండింగ్‌ను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఐదేళ్లలోపు లబ్ధిపొందిన వారు అనర్హులు

బీసీ కార్పొరేషన్ ద్వారా గానీ, బీసీ సంక్షేమశాఖ ద్వారా గానీ ఐదేళ్లలో రూ.50వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అనర్హులుగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. లబ్ధిదారుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

నియోజకవర్గం వివరాలు సైతం..

బీసీల్లోని 15 కుల, చేతివృత్తుల చేసుకునే వారికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించిన విషయం విధితమే. ఈ పథకానికి ఈనెల 6నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికార యంత్రాంగం ప్రకటించింది. వెబ్‌సైట్ https://tsobmmrsbc.cgg.gov. in లో దరఖాస్తులను తీసుకుంటున్నారు. సాధారణంగా ఇతర పథకాల కోసం చేసుకునే దరఖాస్తుల్లో నియోజవర్గం వివరాలు ఉండవు. కానీ గ్రామం, మండలం, జిల్లా వివరాలు ఉంటాయి. కానీ ఈ దరఖాస్తు కోసం ప్రత్యేకంగా నియోజకవర్గం పేరును నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుని కుటుంబ సభ్యులందరి పేర్లు, వారి ఆధార్‌కార్డు నంబర్లు, రేషన్‌కార్డు నంబర్ వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల్సివస్తోంది.

ఈనెల 20వరకు గడువు..

రూ.లక్ష సాయం పథకం కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రకటించిన 15కులాలకు తొలివిడతలో అవకాశం కల్పించింది. దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా అందించాలని ప్రకటించింది. అందులో సగర, నాయీబ్రాహ్మణ, రజక, కుమ్మరి, శాలివాహన, ఆవుసలి, కంసాలి, వడ్రంగి, శిల్పులు, వడ్డెర, కమ్మరి, కంచరి, మేదర, కృష్ణబలిజపూస, మేర టైలర్స్, ఆరెకటిక, ఎంబీసీ కులాల వారికి తొలివిడతలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

అర్హులకు లక్ష సాయం అందించాలి..



అర్హులైన వారికి రూ.లక్ష సాయం ప్రభుత్వం అందించాలి. కులవృత్తుల చేసుకునే వారికి సామగ్రి కోసం ఇచ్చే సాయం ఎంతో ఉపయోగపడుతుంది. లబ్ధిదారుల ఎంపిక వెంటనే చేసి లబ్ధిచేకూర్చితే బాగుటుంది.

– రాజు, నాయీబ్రాహ్మణుడు, మద్దూరు

పారదర్శకంగా అమలు



జిల్లాలో ఇప్పటివరకు కులవృత్తులు, చేతివృత్తుల వారి రూ.లక్ష సాయం దరఖాస్తులు నేటి వరకు 760 వచ్చాయి. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కాబట్టి దరఖాస్తులు పూర్తయిన తర్వాత గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేపట్టి, అర్హులకు అందేలా చూస్తాం.

– కృష్ణామాచారి, జిల్లా బీసీ సంక్షేమాధికారి

స్ఫూర్తినింపిన తెలంగాణ 2 కే రన్

నారాయణపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది స్ఫూర్తిని ప్రతిబింబించేలా జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రన్ ఘనంగా నిర్వహించారని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ 2 కే రన్ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి సావర్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష జెండా ఊపి తెలంగాణ 2కే రన్‌ను ప్రారంభించారు. తెలంగాణ ప్రగతిని చాటుతూ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన తెలంగాణ 2కే రన్ విజయవంతం చేశామన్నారు. సుపరిపాలన దినోత్సవాలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వయస్సుతో నిమిత్తం లేకుండా పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొని స్ఫూర్తిని చాటుకున్నారన్నారు. జిల్లాలోని ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు. నారాయణపేట, మక్తల్‌లో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐక్యతను చాటుతూ యువత, తెలంగాణ 2కే రన్ పూర్తి చేసి విజయవంతం చేశారని స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, సీఐలు రవిబాబు, శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ క్రిష్ణయ్య, ఎస్ఐ సురేశ్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయ పీఈటీలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలంగాణ 2 కే రన్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు

దేశంలోనే నంబర్‌వన్ సీఎం

మక్తల్: దేశంలోనే నంబర్‌వన్ సీఎంగా కేసీఆర్ పేరు తెచ్చుకున్న ఘనత తెలంగాణకు దక్కిందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రన్ కార్యక్రమం జెడ్పీ చైర్మన్ వనజ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి జెండాఊపి ప్రారంభించారు. తెలంగాణ టీ–షర్ట్, బెలూన్, టోపీ ధరించి పాల్గొన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దూసుకెళ్తున్నదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేప ట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, ఎంపీడీఓ శ్రీధర్, సీఐ సీతయ్య, ఎస్ఐలు పర్వతాలు, నరేందర్, విశ్రాంతి పీఈటీ గోపాలం, కావలి శ్రీహరి, తాయప్ప, అమరేందర్, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



మక్తల్‌లో తెలంగాణ రన్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ వనజ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం

క్లుప్తంగా

బావిలో పడి వ్యక్తి మృతి

చిన్నంబావి: బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భీమ్లాతండా సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బెక్కం చెందిన రవి (40) తన భార్యకు రెండేళ్లుగా దూరంగా తన తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం తండా సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తామని ఏఎస్‌ఐ జయన్న తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన శాంతికుమార్ (22) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు వెళ్లి పరిశీలించగా ఇంటోని తాడుకు వేళాడుతుండడంతో అతని కిందికి దించి పరిశీలించారు. కాగా అప్పటికే అతను మృతి చెందాడు.

భార్య మృతికి కారణమైన భర్తకు జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: భార్య మృతికి కారణమైన భర్తకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. రాజాపూర్ మండలం చెన్నవేలికి చెందిన ఫర్జానా బేగం 2018 జూన్ 12న చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నర్సయ్య కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. సోమవారం ఈ కేసు కోర్టుకు రావడంతో అదనపు అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి చిరంజీవి ఆశలత సాక్షులను విచారించారు. భార్య మృతికి కారకుడైన భర్త ఇబ్రహీంకు రెండేళ్ల ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పులిదాడిలో పాడిఆవు మృతి



మన్ననూర్: నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతంలో పాడి ఆవుపై పెద్ద పులి దాడి చేసి చంపిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండలం సార్లపల్లికి చెందిన మేడమోని మల్లయ్య తన పాడి ఆవును మందతో కలిపి కానుగుల బావి పరిసర ప్రాంత అటవీలో మేత కోసం వెళ్లాడు. అకస్మాత్తుగా ఆవుపై పెద్ద పులి దాడి చేసి చంపిందని బాధిత రైతు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఆవును పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు బాధితులకు నష్ట పరిహారం అందజేస్తామని బీట్ ఆఫీసర్ ముత్యాలు తెలిపారు. ఇది ఇలా ఉండగా 10 రోజులుగా పెద్దపులి వటువర్లపల్లి సమీప వ్యవసాయ పొలాలు, అటవీ ప్రాంతంలోనే సంచరిస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. కాడి ఎద్దులు, ప్రజలపై దాడి చేసే ప్రమాదం ఉన్నందున అధికారులు స్పందించి అటవీ లోతట్టు ప్రాంతంలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి స్వల్పగాయాలు



నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో బోల్తా పడటంతో పలువురికి స్వల్ప గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపల్లికి చెందిన కొందరు కూలీలు మిర్చి పంట ఏరడానికి ఆటోలో వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో గుడిపల్లికి చెందిన నిరంజనమ్మకు కాలు విరగడంతో పాటు భీమమ్మ, చిన్నమ్మ, నరసమ్మ, లక్ష్మికి స్వల గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలియజేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అమ్రాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలోని మాదవానిపల్లి స్టేజీ వద్ద చోటుచేసుకుంది. మాదవానిపల్లికి చెందిన ఎలిశెట్టి వెంకటయ్య సొంత వ్యవసాయ పొలం నుంచి తన బైక్‌పై మాదవానిపల్లికి వెళ్తున్నాడు. లక్ష్మాపూర్(బీకే) నుంచి ప్రయాణికులతో అమ్రాబాద్ వైపు వెళ్తున్న జీపు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



జిల్లా సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్

ప్రగతి నివేదన సభ విజయవంతం

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతమైంది. జిల్లా సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, ఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం ప్రగతి నివేదన సభ నిర్వహించారు. సభకు భారీ సంఖ్యలో జనాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకు సీఎం వరాల జల్లు కురిపించారు. సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



సమీకృత భవనం ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్

జోగుళాంబ తల్లి కరుణించాలి

గద్వాల/ గద్వాల రూరల్: జోగుళాంబ తల్లి అందరినీ కరుణించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కోరారు. నూతన కలెక్టరేట్ ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రూ.1,648 కోట్ల వ్యయంతో సమీకృత కలెక్టరేట్ భవనాలను నిర్మించామన్నారు. 33 జిల్లాలకు గాను ఇప్పటి వరకు 20 జిల్లాల్లో కలెక్టరేట్ భవనాలు ప్రారంభమయ్యాని, గద్వాలతో 21కి చేరిందన్నారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణాల వల్ల ఒకేచోట 50 ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తాయన్నారు. ఫలితంగా ప్రజలకు సులభమైన సేవలు అందుతాయని చెప్పారు. సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో మరింత ఉత్సాహంతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు.





సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



దప్పులతో భారీగా తరలివస్తున్న జనం

కార్యాలయాల ప్రారంభోత్సవ పూజలు

గద్వాల: జిల్లాలో ప్రభుత్వం నిర్మించిన నూతన కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలలో సోమవారం ప్రారంభోత్సవ పూజలు నిర్వహించారు. ఆయా భవనాలలో ప్రాతఃకాలం వాస్తు పూజలు, వాస్తు హోమాలు, ప్రత్యేక ఆవాహిత దేవతా పూజలు చేశారు. సాయంత్రం సీఎం కేసీఆర్ హాజరై ఆయా భవనాలను ప్రారంభించి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ సృజన, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులను వేద పండితులు, పాస్టర్‌లు, ఇమామ్‌లు వారి వారి సాంప్రదాయాలలో వేర్వేరుగా ఆశీర్వదించారు.



సభకు తరలివస్తున్న కార్యకర్తలు

సీఎం సభలో హైలైట్స్

గద్వాల రూరల్/ గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ సోమవారం గద్వాలలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా జిల్లా సమీకృత భవన సముదాయం, ఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకేంద్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం కనిపించింది. ఎక్కడ చూసినా గులాబీ తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలతో గులాబీమయంగా మారింది. బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో కిటకిటలాడింది. సభావేదిక వద్ద జెడ్పీచైర్‌పర్సన్ సరితతో వలంటీర్లు, కార్యకర్తలు ఫొటోలు దిగి ఆనందించారు.

- మున్సిపల్ చైర్మన్ కేశవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 37 వార్డుల నుంచి పెద్దఎత్తున జనాలను తరలించారు. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా మహిళలచే బతుకమ్మలను నెత్తిన పెట్టుకుని అభిమానులు, కార్యకర్తలతో సభా ప్రాంగణానికి ర్యాలీగా తరలివచ్చారు.
- బహిరంగ సభకు పెద్దఎత్తున జనాలు తరలివచ్చారు. అయితే సభ ప్రారంభానికి ముందే వచ్చిన మహిళలు ఎండవేడిమికి తాళలేక ఇబ్బందులు పడ్డారు. సభ ఆలస్యంగా మొదలు కావడంతో ఆగ్రహానికి గురైన కొందరు కుర్చీలను ఎత్తిపడేశారు.
- బహిరంగ సభకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలను తరలించారు. ఈ క్రమంలో బైక్‌లకు పెట్రోల్ ఖర్చులకు డబ్బులు పంపిణీ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.
- సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లాకేంద్రంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చిన్న అనుమానం వచ్చిన వెంటనే వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అలాగే పాతబస్టాండ్, రాజీవ్‌మార్గ్, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఉన్న వ్యాపార దుకాణాలను పోలీసులు బలవంతంగా మూయించారు. షాపులను మూయని వారిపట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై సదరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వస్తే తమ వ్యాపారం పోగొట్టుకోవాలా.. ఇదెక్కడి దౌర్జన్యం అని మండిపడ్డారు. అలాగే షాపుల ముందు నిలిచిన వాహనాలను సైతం ట్రాఫిక్ వాహన క్రేన్ సాయంతో ఠాణాకు తరలించారు. దీనిపై పట్టణవాసుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వినిపించాయి.

అరెస్టులు.. నిరసనలు

గద్వాల క్రైం: సీఎం పర్యటన సందర్భంగా ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల నాయకులను పోలీసులు సోమవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేవైఎం కార్యకార్తలు పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుపై టైర్లకు నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఇంటివద్ద పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించి కార్యకార్తలను, నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం రాజీవ్‌మార్గ్ రోడ్డు మార్గంలో వెలసిన వ్యాపార దుకాణాలను పోలీసులు బలవంతగా మూసి వేయించారు. పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో సామాన్యులు, ఉదోగ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2వేల మంది పోలీసులు విధులు నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్ నుంచి సభా ప్రాంగణం వరకు పటిష్టమైన బందోబస్తు మధ్య సీఎం పర్యటన కొనసాగింది.

అర్చక సమస్యలపై వినతి



సమస్యలు వివరిస్తున్న రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ

జోగుళాంబ శక్తిపీఠం: దేవదాయ శాఖ పరిధిలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. గద్వాల ఎస్పీ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ సీఎం కేసీఆర్‌కు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. 1,326 మంది తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, నెలవారి వేతనాలు పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. పదవివిరమణ పొందే ఆలయాల అర్చక ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వాలని తెలిపారు. సీఎం స్పందిస్తూ సీఎస్‌ను వివరణ కోరుతూ తక్షణం సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు జిల్లాకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మ, జిల్లా ప్రచార కార్యదర్శి మారుతి ఉన్నారు.

అదుపుతప్పి వాహనం బోల్తా



బుర్రవాగు సమీపంలో బ్రిడ్జిని ఢీకొని కింద పడిన వాహనం

ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు

కొత్తకోట రూరల్: అతివేగంతో వెళ్తున్న వాహనం బ్రిడ్జిని ఢీకొని కిందపడటంతో ఇద్దరు మృతి చెందగా, నలుగురికి గాయాలైన ఘటన సోమవారం మోజర్ల స్టేజీ సమీపంలో బుర్రవాగు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. కర్నూల్ జిల్లాలోని పలు మండలాలకు చెందిన నలుగురు రైతులు కూరగాయలు విక్రయించేందుకు హైదరాబాద్ మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి అదే వాహనం బయలుదేరారు. సోమవారం మధ్యాహ్నం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల స్టేజీ సమీపంలోకి రాగానే బొలెరో డ్రైవర్ ప్రభాకర్ అతివేగంగా నడుపడంతో అదుపుతప్పి బ్రిడ్జిని ఢీకొట్టింది. దీంతో వాహనం బ్రిడ్జి కిందకు దూసుకెళ్లింది. నలుగురిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందారు. కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్ మండలం కలుగొట్లకు చెందిన గొల్ల హన్మంతు(45), ఆదోని మండలం పెసలబండకు చెందిన వగ్గని రాముడు(42) మృతి చెందారు. ఈరన్న, కుల్లాయినాయక్, ప్రతాప్‌లతో పాటు ఎల్‌అండ్‌టీ రోడ్డు పనులు చేస్తున్న మల్లమ్మ గాయాలయ్యాయి. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గద్వాల జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వెళ్తుండగా టన ప్రదేశంలో జనం ఉండటంతో కాన్వాయ్‌ని ఆపి పరిశీలించారు. క్షతగాత్రులకు తన సిబ్బందితో కలిసి సపర్యాలు చేసి అంబులెన్స్, ఆటోలో ఎక్కించి పంపించారు.

పాఠశాల తనిఖీ

వెల్దండ: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని హైదరాబాద్ సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఆర్.ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం వెల్దండలోని సాంఘిక సంక్షేమశాఖ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులు, తరగతి గదులు, భోజనశాల, ఆట స్థలం తదితర వాటిని పరిశీలించారు. ప్రిన్సిపాల్ షకిలా సుల్తాన, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్ ఇంటి ఎదుట యువతి నిరసన

అదుపులోకి తీసుకున్న పోలీసులు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత నివాసం ఎదుట సోమవారం ఓ యువతి నిరసన వ్యక్తం చేయగా, పోలీసులు చేరుకుని ఆమెను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. అయిజ మండలం చిన్న ధన్వాడకు చెందిన సంధ్య కొన్ని నెలల క్రితం జెడ్పీ చైర్‌పర్సన్ సరితను కలిసి తన సమస్య పరిష్కారం కోసం విన్నవించుకుంది. ఈ క్రమంలో వ్యక్తిగత సహాయకుడిగా (ప్రైవేట్ వ్యక్తి) పరమేష్‌తో పరిచయం ఏర్పడింది. అయితే తనను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని తెలిపింది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో నల్లకుంట కాలనీలో నివాసం ఉంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటి ముందు 10:30 గంటల సమయంలో తనకు న్యాయం చేయలంటూ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నం చేసింది. పోలీసులు సమాచారం తెలుసుకుని యువతిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన జిల్లా కేంద్రంలో కలకలంగా మారింది. ఈ సంఘటనపై పరమేష్ స్పందిస్తూ.. యువతి చేస్తున్న ఆరోపణలు ఎంత మాత్రం వాస్తవం కాదన్నారు. వ్యక్తిగతగా, పరోక్షకంగా యువతితో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పరిమాణాలు చూస్తుంటే ఇదోక రాజకీయ డ్రామాలా ఉందని, ఇక్కడి రాజకీయ నాయకుల కుట్ర పూరితమే అన్నారు. పోలీసులు విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

కేసీఆర్ పాలనలో మహిళలకు రక్షణ కరువు



కాంగ్రెస్ పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావును సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట: సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళలపై అనుక్షణం ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతున్నా స్పందించని దుర్మార్గపు ప్రభుత్వమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు ముదిరాజ్ ధ్వజమెత్తారు. సోమవారం నారాయణపేట డీసీసీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో 18 నుంచి 37ఏళ్లలోపు చదువుకునే మహిళలు 2,555 రెఫరల్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకొని పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. త్వరలోనే నారాయణపేట జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు పూర్తి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రియాంకగాంధీ చేతుల మీదుగా ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీని ఉచితంగా అందిస్తామని అన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత వివిధ మండలాల మహిళా అధ్యక్షులను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. నారాయణపేటకు సిద్ధమ్మ, మక్తల్‌కు సూర్యకుమారి, నర్వలో రాధ, ఊట్కూర్‌కు కిష్టమ్మ, దామరగిద్దలో పూర్ణజ్యోతి, ధన్వాడలో సుశీల, మరికల్‌లో రాజేశ్వరి, మద్దూర్‌కు లక్ష్మి, కోస్గికి మమత, గుండుమాల్‌కు శ్రావణిని నియమించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మక్తల్ మున్సిపల్ కౌన్సిలర్లు రాధ, శంకరమ్మ, మహిళా నాయకులు శ్రావణి, లక్ష్మి, కవిత, సిద్దమ్మ, విజయలక్ష్మి, రాజేశ్వరి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ సలీం, చిట్టెం రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా షా–అలీ–పహిల్వాన్ ఉర్సు

- దర్గాల్లో వైభవంగా గంధోత్సవం
- సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీలు
- నేడు ధడ్ ముబారక్ దర్గాలో పెద్ద కిస్తీలు

అలంపూర్/అలంపూర్ రూరల్ : షా–అలీ–పహిల్వాన్ ఉర్సు ఘనంగా కొనసాగుతుంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సర్ ముబారక్, ధడ్ ముబారక్ దర్గాల్లో గంధోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీ పోటీలు నిర్వహించారు. అలంపూర్ షా–అలీ–పహిల్వాన్ ఉర్సులో భాగంగా గుల్బార్గా నుంచి గంధం తీసుకొచ్చారు. అక్కడ మత పెద్దలు గంధాన్ని సుగంధ పరిమళాలను కలిపారు. అనంతరం సయ్యద్‌ఖాదర్ భాషా ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి గంధం చేరుకుంది. అక్కడ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం తహసీల్దార్ సుభాష్‌నాయుడు, మత పెద్దలు గంధం శిరస్సున ధరించి గంధోత్సవాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గంధాన్ని సర్‌ముబారక్ దర్గా తర్వాత ధడ్ ముబారక్ దర్గాలకు తీసుకెళ్లారు. ప్రార్థనల అనంతరం ఉర్సులో మొదటి రోజు గంధోత్సవం ఘట్టం ముగిసింది.



సర్ ముబారక్ దర్గా వద్ద చిన్న కిస్తీ పోటీలు

సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీలు

ఉర్సులో భాగంగా షా అలీ పహిల్వాన్ సర్ ముబారక్ దర్గాలో సోమవారం చిన్న కిస్తీ పోటీలు నిర్వహించారు. యువకులు పోటీపడి వివిధ రకాల విన్యాసాలను చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉర్సు సందర్భంగా కులమతాలకు అతీతంగా జనం తరలొచ్చి దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన వీధుల్లో వెలిసిన దుకాణ సముదాయాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సర్కస్, రంగుల రాట్నాలు, బొమ్మల దుకాణాల వద్ద చిన్నారులు సందడిగా గడిపారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి కిస్తిలో పలావ్, మిఠాయిలు వేయగా అక్కడే ఉన్న యువకులు పోటీపడి వాటిని భక్తులపైకి విసిరారు. ఈ క్రమంలో పోటికి దిగిన పహిల్వాన్‌లు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



గంధోత్సవం సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు



గంధోత్సవాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, నిర్వాహకులు

నేడు పెద్ద కిస్తీలు

ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ధడ్ ముబారక్ దర్గా వద్ద పెద్ద కిస్తీలు మంగళవారం ప్రధానంగా నిర్వహిస్తారు. ఈ పోటీలు తిలకించడానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఉర్సు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో సౌకర్యాలను సమీక్షిస్తున్నారు. పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

వార్ధాపై 'మహా' మెలిక !

- ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేయాలన్న మహారాష్ట్ర
- గతేడాది మేడిగడ్డకు వరదలతో తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని వెల్లడి
- స్థానికంగా, రాజకీయంగా ఇబ్బందులెదుర్కొన్నట్లు లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో ప్రతిపాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 'వార్ధా'ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపే విషయంలో మహారాష్ట్ర కొత్త మెలిక పెట్టింది. 155–160 మీటర్ల నిడివిలో వేర్వేరు పూర్తిస్థాయి నిల్వమట్టాల (ఎఫ్‌టీఎల్)తో వార్ధా బ్యారేజీ నిర్మిస్తే ఉండనున్న ముంపు ప్రభావం, ప్రభావితం కానున్న గ్రామాలపై ఇప్పటికే మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఇంజనీర్ల బృందం సర్వే నిర్వహించి నివేదిక సమర్పించింది. అయితే గతేడాది జూలైలో గోదావరికి వరదలు పోటెత్తడంతో మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్ కారణంగా తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని, ఈ నేపథ్యంలో వేర్వేరు ఎఫ్‌టీఎల్ స్థాయిల వద్ద వార్ధా బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో ఉండనున్న ముంపుపై మళ్లీ అధ్యయనం జరపాలని మహారాష్ట్ర స్పష్టం చేసింది. ఈ మేరకు మహారాష్ట్ర జలవనరుల శాఖ అంతర్రాష్ట్ర విభాగం సహాయ చీఫ్ ఇంజనీర్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ రాశారు. మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన వరదతో స్థానికంగా, రాజకీయంగా మహారాష్ట్రలో తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని, బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ సర్వే జరపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్ల స్థాయిలో ఈ అంశాన్ని పరిష్కరించుకున్న తర్వాతే అంతరాష్ట్ర బోర్డు సమావేశం నిర్వహించాలని కోరింది.

అంతరాష్ట్ర ఒప్పందానికి మరింత జాప్యం!

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడి హట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించడానికి పరస్పర అంగీకారం తెలుపుతూ 2016 ఆగస్టు 23న జరిగిన అంతర్రాష్ట్ర బోర్డు సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు సంతకాలు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని పక్కనపెట్టింది. దీనికి బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. ఈ కారణంగా నష్టపోయిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించడానికి తుమ్మిడిహట్టికి బదులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేట వద్ద వార్ధా నదిపై బ్యారేజీ నిర్మించాలని ప్ర భుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రూ.4,550.73 కోట్లతో ప్రాజెక్టు నివేదికను అనుమతుల కోసం ఇటీవల కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) సమర్పించింది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి గతంలో చేసుకున్న ఒప్పందాన్ని సవరించడం ద్వారా వార్ధా బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలపాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసింది. ఇందుకోసం అంతర్రాష్ట్ర బోర్డు సమావేశం నిర్వహించాలని కోరింది. అయితే దీనికి ముందే బ్యాక్ వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం జరపాలని తాజాగా మహారాష్ట్ర కోరడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్టు అయింది. వార్ధా ప్రాజెక్టు కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,34,880 ఎకరాల ఆయకట్టుకు, మరో 5,868 ఎకరాల స్థిరీకరణకు ప్రభుత్వం ప్రతిపాదించింది.

నల్లగొండలో నీళ్ల మంటలు!

▶ మొదటి పేజీ తరువాయి

పాదయాత్ర ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులే లక్ష్యంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ హయాంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన శ్రీశైలం సొరంగ మార్గం, నక్కలగండి, పెండ్లిపాకల, బ్రాహ్మణ వెల్లంల వంటి ప్రాజెక్టులపై భట్టి చర్చ పెడుతున్నారు. ఈ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చూపుతోందని.. జిల్లాకు చెందిన మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పట్టించుకోవడం లేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నక్కలగండి రిజర్వాయర్ కింద నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఆ తర్వాత రెండు రోజులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన కృషి ఉందని.. హైదరాబాద్‌కు దాని ద్వారానే తాగునీళ్లు వచ్చాయని చెప్పారు. ఇక జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదివారం మీడియా సమావేశం పెట్టి.. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని దుర్మార్గమైన టెక్నాలజీతో తెచ్చారని, పర్యావరణ అనుమతుల పేరుతో ఆగిపోయేలా చూశారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. దీనికి ప్రతిగా సోమవారం భట్టి విక్రమార్క మరోసారి విరుచుకుపడ్డారు. ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్న దానికి నేరుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

భట్టికి తోడుగా కోమటిరెడ్డి, ఉత్తమ్..

భట్టి పాదయాత్రలో పాల్గొన్న ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ఎస్ఎల్‌బీసీ కోసం నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి, 2005లో అనుమతి తీసుకొని పనులు మొదలుపెట్టి 70శాతం పూర్తి చేస్తే.. బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని పనులు పూర్తి చేయిస్తానని 2014లో ప్రకటించిన సీఎం కేసీఆర్.. తర్వాత దీనిని పట్టించుకోకుండా, కమీషన్ల కాళేశ్వరంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఇక పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా నల్లగొండ రైతులను సీఎం కేసీఆర్ మోసం చేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా.. భట్టి పాదయాత్ర సందర్భంగా ఈ నెల 15న నల్లగొండ పట్టణంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి పదేళ్లు కావస్తున్నా ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. ఈ ప్రాజెక్టులు పూర్తి కాకుండా అడ్డుకున్నది ఎవరు? వాటి ద్వారా నల్లగొండ జిల్లా ప్రజలకు నీళ్లు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలి. దీనిపై ఎక్కడైనా చర్చించేందుకు నేను సిద్ధం. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయాంలో నల్లగొండ జిల్లా ప్రజలకు నీళ్లు ఇవ్వకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని సుఖేందర్ రెడ్డి అన్నారట. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే.. ఇన్నేళ్లయినా డిండి, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండిని పూర్తి చేయనందుకు ఇప్పుడు రాజీనామా చేయాలి. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయడానికి కేసీఆర్ నుంచి నిధులు తీసుకురావాల్సిన జిల్లా మంత్రి.. నాగార్జున సాగర్ నుంచి నీళ్లు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు.

– సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

2014కు ముందు జిల్లాలో సాగులోకి వచ్చిందెంత? ఇప్పుడు సాగులో ఉన్న భూమి ఎంత? దిగుబడి ఎంత? 40 లక్షల టన్నులకుపైగా ధాన్యం దిగుబడితో రికార్డ్ సృష్టించాం. సాగర్ కింద వరుసగా 16 పంటలకు నీళ్లు ఇచ్చాం. 2014కు ముందు ఏనాడైనా లాఠీచార్జిలు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించారా? ఫ్లోరైడ్ సమస్యను పట్టించుకోకుండా లక్షల మంది నడ్డి విరిచారు. మిషన్ భగీరథతో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టింది కేసీఆర్ కాదా? ఇప్పుడున్న నిరుద్యోగులు డిగ్రీలు ఎప్పుడు పూర్తిచేశారో లెక్కలు తీద్దామా? జిల్లా అభివృద్ధిపై ఎక్కడ చర్చ పెడదామో చెప్పండి. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏరియా జాన్‌పహాడ్‌లో పెడదామా? లేక జానారెడ్డి ఏరియా రాజవరంలో పెడదామా? విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద కరెంటుపై చర్చపెడదామా? మీరే చెప్పండి.

– విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఉద్యమ నేతకు కడసారి వీడ్కోలు



జగదీశ్ కూతురు, కుమారుడిని ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్



పాడె మోస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత తదితరులు

- ములుగు జిల్లా మల్లంపల్లిలో జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు
- మంత్రి కేటీఆర్ సహా పాల్గొన్న పలువురు ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం ములుగు జిల్లా మల్లంపల్లిలో సోమవారం జరిగాయి. జగదీశ్ ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హఠాన్మరణం పొందిన విషయం తెలిసిందే. ఆయనకు కడసారి వీడ్కోలు పలకడం కోసం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. గంటన్నరపాటు జరిగిన జగదీశ్ అంతిమయాత్రలో మంత్రి కేటీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రముఖులు, శ్రేణులు పాల్గొన్నారు. కేటీఆర్‌ను చూడగానే జగదీశ్ తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్ బోరున విలపించారు. కేటీఆర్ వారిని ఓదార్చారు. ఆయన మరణం జిల్లా ప్రజలకు, పార్టీకి తీరనిలోటని కేటీఆర్ అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నారు. అంతిమయాత్రలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ కవిత జగదీశ్ పాడె మోశారు.

శిరీషది హత్యా.. ఆత్మహత్యా?

- అన్ని కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు
- మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం
- కాల్ డేటా ఆధారంగా మరో ఇద్దరిని విచారిస్తున్న పోలీసులు
- హత్యను సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్



శిరీష (ఫైల్)

పరిగి, సాక్షి న్యూఢిల్లీ: పారా మెడికల్ విద్యార్థి శిరీష మృతిపై మిస్టరీ వీడలేదు. యువతిది హత్యా.. ఆత్మహత్యా.. అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కాల్లాపూర్ శివారులోని నీటి కుంటలో ఆదివారం మధ్యాహ్నం శిరీష (19) మృతదేహం లభ్యమైంది. ఒంటిపై పలు చోట్ల గాయాలు ఉండటం, రెండు కళ్లనూ పొడిచి ఉండటంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం విదితమే. పలువురు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివరాలు ఆరా తీసే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా సోమవారం గ్రామానికి చేరుకున్న వైద్యులు శిరీష మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం నిర్వహించారు. యువతి శరీరంపై గాయాలు ఉన్నట్లు ధ్రువీకరించారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. శిరీషది ముమ్మాటికీ హత్యేనని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి జంగయ్య, బావ అనిల్‌పై వారు మండిపడ్డారు. శిరీష మృతికి వారే కారణమంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు కల్పించుకుని త్వరలోనే పూర్తి వాస్తవాలు తెలుస్తాయని, అప్పటివరకు ఓపిక పట్టాలని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. తన చెల్లిని చంపిన వారు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని మృతురాలి తమ్ముడు శ్రీకాంత్ కోరాడు.

పోలీసుల అదుపులో మరో ఇద్దరు

శిరీష అంత్యక్రియలు ముగిసిన తర్వాత తండ్రి జంగయ్య, బావ అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాల్ డేటా ఆధారంగా గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా.. కేసు దర్యాప్తులో ఉందని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు.

మూడు రోజుల్లో రిపోర్టు పంపండి

తెలంగాణ డీజీపీకి మహిళా కమిషన్ ఆదేశం

శిరీష దారుణ హత్యను జాతీయ మహిళా కమిషన్ సుమోటో కేసుగా స్వీకరించింది. స్క్రూ డ్రైవర్‌తో బాలిక కళ్లు పీకి, బ్లేడ్‌తో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటనపై ఢిల్లీలోని ఎన్సీడబ్ల్యూ సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. అంతేగాక మూడు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను పంపించాలని తెలంగాణ డీజీపీకి సూచించింది. తెలంగాణలో బాలికలు, యువతులు, మహిళలపై పెరిగిపోతున్న నేరాలపై జాతీయ మహిళా కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

కర్నూల్ మెడికల్ కాలేజీలో మల్టీ యుటిలిటీ సెంటర్

రూ.15 కోట్లతో నిర్మించనున్న కేఎంసీజీటీ

సాక్షి, అమరావతి: కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణానికి కర్నూల్ మెడికల్ కాలేజ్ గ్రాడ్యుయేట్ ట్రస్ట్(కేఎంసీజీటీ) ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సమక్షంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, కేఎంసీజీటీ ప్రతినిధులు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ప్రాథమికంగా రూ.15 కోట్ల అంచనాతో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు కేఎంసీజీటీ ప్రతినిధులు తెలిపారు. అవసరమైతే మరిన్ని అదనపు నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సెంటర్‌లో 300 మంది సామర్థ్యంతో వర్చువల్ కాన్ఫరెన్స్ హాల్, డిజిటల్ లైబ్రరీ, ఇతర అధునాతన విద్యా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టినందుకు కేఎంసీజీటీ ప్రతినిధులను కృష్ణబాబు అభినందించారు.

'సీఎన్‌ఆర్'కు బీ ప్లస్ గ్రేడ్

- ప్రైవేట్ నుంచి ప్రభుత్వపరం వరకు
- డిగ్రీ కళాశాలది నాలుగు దశాబ్దాల చరిత్ర
- ఎంతో మంది పూర్వ విద్యార్థుల సహకారం



సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నారాయణపేట రూరల్: ప్రైవేటుగా ప్రారంభమై.. ఎయిడేడ్‌గా రూపాంతరం చెంది.. ప్రభుత్వపరమైన డిగ్రీ కళాశాలకు నాలుగు దశాబ్దాల చరిత్రతో పాటు తాజాగా అత్యుత్తమ గుర్తింపు లభించింది. తొలి ప్రయత్నంలోనే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) 'బి ప్లస్' గ్రేడ్ దక్కించుకుంది. ఈ ఘనత సాధించడం వెనుక ఎంతో కృషి ఉంది. విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా వివిధ రంగాల్లో శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన ప్రతిభను అందించారు. వీటన్నింటికి మించి మౌలిక వసతులు ఉండటం న్యాక్ గుర్తింపు లభించింది.

నాటి నుంచి నేటి వరకు...

వలసల జిల్లా.. వెనకబడిన ప్రాంతంగా ఉన్న మహబూబ్‌నగర్‌లో చిట్టచివరలో ఉండే నారాయణపేట పట్టణం ఎలాంటి సౌకర్యాలు లేక విద్యారంగంలో వెనకబడి ఉండేది. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి చొరవతో 1984లో రైతుల సహకారంతో సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాలను ప్రైవేట్‌గా ప్రారంభించి ఎయిడేడ్ గుర్తింపు సంపాదించారు. గ్రామీణ విద్యార్థులు ఫీజులు చెల్లించడం కష్టమని భావించి విద్యార్థిసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు చేసి ప్రభుత్వ పరం చేయాలని డిమాండ్ చేశారు. చివరికి ప్రస్తుత ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సమస్యను పరిష్కరించేందుకు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాలను ప్రభుత్వ పరం చేయించారు. 2018 జనవరి 3న జీఓ విడుదల అయిన వెంటనే కళాశాలతో పాటు ఎన్నో ఏళ్లుగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న అధ్యాపకులు సైతం ప్రభుత్వ అధ్యాపకులుగా గుర్తించాలని కోరి విజయం సాధించారు. కళాశాల పేరును చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అందరి సహకారంతో...

కళాశాల అభివృద్ధితో పాటు న్యాక్ గుర్తింపు సైతం ఎంతో మంది సహకారం లభించింది. పూర్వ విద్యార్థులంతా బ్యాచుల వారీగా గ్రూపులు ఏర్పాటు చేసుకుని ఫండింగ్ చేశారు. మరికొందరు సొంతంగా అవసరమైన వస్తువులు, సౌకర్యాల కల్పనకు తోడ్పాటును అందించారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సైతం రూ. 2.09కోట్ల ప్రత్యేక నిధులు అందించారు.

బృందం పర్యటన ఇలా..

న్యాక్ బృందం గత నెల 25, 26వ తేదీల్లో కళాశాలను సందర్శించింది. నలుగురు సభ్యులు హాజరై మౌలిక వసతులు, విద్యాబోధన, పరీక్షల నిర్వహణ, సౌకర్యాల కల్పనను పరిశీలించారు. కళాశాలపై తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల అభిప్రాయాలను సేకరించారు. నివేదికను సిద్ధం చేసుకుని శనివారం సాయంత్రం 'బి ప్లస్' గ్రేడ్‌ను కేటాయిస్తు సీఎన్‌ఆర్ డీసీకి గుర్తింపును ఇచ్చారు.

ఉన్నత విద్యావంతుల తయారీ

నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన కళాశాల ఎంతో మంది ఉన్నత విద్యావంతులను తయారు చేసింది. దూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యను చదవలేని వారికి ఆసరాగా నిలిచింది. ముఖ్యంగా బాలికలు, మహిళలకు స్థానికంగా డిగ్రీ చేసుకునే అవకాశం అందించింది. ప్రస్తుతం 1,500మంది రెగ్యులర్‌గా చేరగా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా 2వేల మంది చదువుకుంటున్నారు. ఇక్కడ చదువుకుని కలెక్టర్, జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.

గుర్తింపుతో కలిగే లాభాలు

ప్రస్తుత స్థాయి నుంచి న్యాక్ గుర్తింపుతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రోజు నిర్వహించే పీర్ టీమ్ సందర్శనలతో పాటు గుర్తింపు పొందిన సంస్థల వర్క్‌షాప్, సెమినార్‌లు సులభతరం అవుతాయి. అదేవిధంగా రూసా ద్వారా సుమారు రూ.2కోట్ల నిధులు వస్తాయి. అటానమస్ (స్వయంప్రతిపత్తి) కల్పించేందుకు ఆస్కారం ఉంటుంది. ఓ యూనివర్సిటీ మాదిరి సొంతంగా కళాశాలలోనే అకాడమిక్ క్యాలెండర్ తయారు చేసుకునే వీలు కలుగుతుంది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం సొంతంగా చేసుకోవచ్చు. అన్నింటికి మించి హాస్టల్ ఏర్పాటుకు మార్గం సులభతరం అవుతుంది.

ఆనందంగా ఉంది



ఈ కళాశాలలో చదువుకోవడం వల్ల నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాను. నాలా ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పరం కావడంతో ఎంతో మంది పేద విద్యార్థులకు ఆసరగా నిలుస్తుందని భావించాం. న్యాక్ గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– జనార్దన్‌రెడ్డి, పూర్వ విద్యార్థి


మరింత అభివృద్ధి



విద్యార్థుల కష్ట ఫలితం, ఎమ్మెల్యేల సహకారంతో కళాశాల ప్రభుత్వ పరమైంది. మరోసారి చేయిచేయి కలిపి న్యాక్ గుర్తింపు సాధించుకోగలిగాం. దీంతో రూసా ద్వారా నిధులు, ప్రభుత్వ సహకారం మరింత పెరుగుతుంది. స్వతంత్ర ప్రతిపత్తి లభిస్తే సొంతంగా అకాడమిక్ క్యాలెండర్, పరీక్షల నిర్వహణ చేసుకుంటాం. పేద, దూరప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి సైతం లభించే అవకాశం ఉంటుంది.

– నారాయణగౌడ్, న్యాక్ కో ఆర్డినేటర్

అందరి కష్ట ఫలం



విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులందరి కృషి ఫలితంగా న్యాక్ గుర్తింపు సాధించగలిగాం. నెల రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా చాలా మంది ఆర్థికంగా, భౌతికంగా సహకారం అందించారు. ఈ ప్రకటనతో అందరి కల నెరవేరినట్లు అయ్యింది. మాపై మరింత బాధ్యత పెరిగింది. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతాం.

– రంగారెడ్డి, ప్రిన్సిపాల్

తోడ్పాటు అందిస్తాం



వెనకబడిన ప్రాంతాన్ని విద్యారంగంలో అభివృద్ధి చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాం. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని డిగ్రీ కళాశాలను సీఎంను ఒప్పించి ప్రభుత్వ పరం చేయించాను. కళాశాల అభివృద్ధికి రూ.2.09కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాను. ప్రభుత్వ పాలిటెక్నిక్, ధన్వాడకు డిగ్రీ కళాశాల, మెడికల్ కళాశాల తీసుకుని వచ్చాను. భవిష్యత్‌లో నర్సింగ్ కాలేజీ, పీజీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తాను. సీఎన్‌ఆర్ డీసీకి న్యాక్ బీప్లస్ గ్రేడ్ రావడం ఆనందంగా ఉంది. కళాశాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందిస్తాను. – ఎస్.రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

మరో పోరాటానికి సిద్ధం కావాలి

- త్వరలో లక్షలాది మందితో చలో హైదరాబాద్
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మాదిగలు, ఉపకులాలు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజు మాదిగ అధ్యక్షతన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ లక్ష్య సాధనకు ఉమ్మడి జిల్లా మాదిగల సన్నాహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల ఆధిపత్యంతోనే ఎస్సీ వర్గీకరణ కావడం లేదన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అనుకూలమని ప్రకటనలు చేస్తుండగా బిల్లు మాత్రం పెట్టకుండా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో 1965లో వచ్చిన రామచంద్ర రాజు కమిషన్ నుంచి 2008లో వరకు ఉషామెహ్రా కమిషన్ వరకు అన్ని నివేదికలు అనుకూలంగా ఇచ్చాయని తెలిపారు. యూపీఏ నుంచి ఎన్‌డీఏ వరకు అన్ని ప్రభుత్వాలు వాళ్ల పార్టీల్లో మెనిఫెస్టోలో చేర్చినప్పటికీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో లక్షలాది మందితో చలో హైదరాబాద్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని, దాని కోసం నిర్మాణాత్మకంగా ఎదగాలని సూచించారు. కావలి కృష్ణయ్య, జంగయ్య, కార్తీక్, శ్రీరాములు, ఖాదరయ్య, కేశవులు, అంజి, యాదయ్య పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ బృందం పర్యటన



నిజాలాపూర్ వద్ద చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

అడ్డాకుల: మూసాపేట మండలం నిజలాపూర్‌లో కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటించింది. కేంద్ర ఐఏఎస్ అధికారి పొసామి బసు రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం నిజలాపూర్ శివారులోని పెద్దవాగులో నిర్మించిన చెక్ డ్యాంను పరిశీలించారు. వాగు పరిసరాల్లో ఉన్న వ్యవసాయ బావుల్లో నీటిమట్టాలను చూసి, స్థానిక రైతులతో మాట్లాడారు. చెక్‌డ్యాం నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరిగినట్లు తేలిందని అధికారులు ఆమెకు వివరించారు. అదేవిధంగా కొమిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఆయిల్‌ఫాం తోటలను పరిశీలించారు. నీటి సంరక్షణ వల్ల భూగర్భ జలాలు పెరగడం మంచి పరిణామని ఆమె తెలిపారు. జిల్లాలో నీటి నిల్వ కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నట్లు చెప్పారు. పంటల విధానంలో మార్పును తీసుకురావాల్సిన అవసరముందని ఆమె అభిప్రాయపడ్డారని అధికారులు తెలిపారు. వారి వెంట డీఆర్‌డీఓ యాదయ్య, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

తెలంగాణ వాసికి ఏపీలో డైరెక్టర్ పదవి!

అభిమా(నా)నికి దక్కిన గౌరవం!

- నియామక పత్రం అందజేసిన ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల

వనపర్తి: వనపర్తి మండలం చందాపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్యకు ఏపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. ఏపీ డిఫరెంట్ ఎబుల్డ్, సీనియర్ సిటిజన్ అసిస్టెన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ మేరకు గతనెల 22వ తేదీన ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నుంచి ఉత్తర్వులను వెంకటయ్య అందుకున్నారు. ప్రొటోకాల్‌తో పాటు గౌరవవేతనం, కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక ఛాంబర్ కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, తనకు పదవి వచ్చేందుకు సహకరించిన సజ్జల రామకృష్ణారెడ్డికి, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డికి ఈ సందర్భంగా వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ఆర్‌తో సుమారు 1,418 కిలోమీటర్లు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో సుమారు 3,800 కిలోమీటర్లు, వైఎస్ షర్మిలతో సుమారు 3,600 కిలోమీటర్లు పాదయాత్ర చేశానని వెంకటయ్య తెలిపారు.

సజ్జల రామకృష్ణారెడ్డి నుంచి ఉత్తర్వు కాపీని అందుకుంటున్న వెంకటయ్య →



శ్రీశైలంలో 809.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట(అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో సోమవారం 809.3 అడుగుల నీటిమట్టం, 33.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయంలో 212 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,018 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.